సాక్షి
వనపర్తి
మంగళవారం ı 4 ı మార్చి ı 2025



అది భూదాన్ భూమే..

జడ్చర్లలో సర్వే నం.138లోని భూమి భూదాన్‌దే అని సీసీఎల్‌ఏ కోర్టు చెప్పింది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-29 (మంగళవారం సాయంత్రం)

సహర్ 5-10 (బుధవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /17.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి



ఖిల్లాఘనపురం: సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఏఈ రమేష్ నాయుడుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



వనపర్తి రూరల్: పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికవర్గం సంఘటితంగా పోరాడితేనే పాలక వర్గాలు దిగివస్తాయన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలకు వంద శాతం గ్రాస్ శాలరీతో పాటు ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని.. ఏఎన్‌ఎంల పోస్టుల సంఖ్య పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ, సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ, సుమిత్ర, అరుణ, మాధవి, పార్వతి, విజయ, లక్ష్మి, శివలీల, నాగలక్ష్మి, హారతి, ఈశ్వరమ్మ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వసతులు కరువు

పాన్‌గల్: ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్న ప్రాంతాల్లో కనీస వసతులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కూలీలకు సకాలంలో కూలి డబ్బులు అందకపోవడంతో పాటు పని ప్రదేశంలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తూ.. కూలీల ఇబ్బందులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణయ్య, సాయిలు, భీమయ్య, భగవంతు పాల్గొన్నారు.

సర్వం సన్నద్ధం

ఇంటర్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈఓ ఎర్ర అంజయ్య

- జిల్లావ్యాప్తంగా 25 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 12,150 మంది విద్యార్థులు
- రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు

అమరచింత: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 5నుంచి 25వ తేదీ వరకు జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో మొత్తం 12,150 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 6,457 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,693 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 25 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 600 మంది ఇన్విజిలేటర్లను నియమించడంతో పాటు నాలుగు సిట్టింగ్ స్క్వాడ్స్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని.. విద్యార్థులు 8:45 గంటలలోగా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..

ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తూ.. విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల్లోని అన్ని గదుల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. డ్యూయల్ డెస్క్ బెంచీలు, తాగునీటి వసతులను యథావిధిగా కల్పించనున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా కళాశాలల్లో విద్యార్థులను వార్షిక పరీక్షలకు అన్నివిధాలా సన్నద్ధం చేశారు. పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సీసీ నిఘాలో..

ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ఈసారి సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటికే అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఎప్పటికప్పుడు ప్రత్యేక స్క్వాడ్స్‌తో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పాల్పడి పట్టుబడితే విద్యార్థులు తమ విలువైన గమ్యాన్ని కోల్పోతారని అధికారులు హెచ్చరిస్తున్నారు.

163 సెక్షన్ అమలు..

ఇంటర్ పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయం ముగిసే వరకు మూసి ఉంచాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 12,150 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు 25 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లు అందాయి. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

– ఎర్ర అంజయ్య, డీఐఈఓ

పంటలకు సాగునీరు అందిస్తాం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- గతేడాది కంటే ఈసారి 52 శాతం అధికంగా సాగు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో యాసంగి పంటలకు సకాలంలో తడి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి యాసంగి పంటలు, ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెనూ అమలు తదితర అంశాలపై కలెక్టర్, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది యాసంగిలో దాదాపు 90వేల ఎకరాల్లో వరిసాగు చేయగా.. ఈసారి 52 శాతం అధికంగా 1.41 లక్షల ఎకరాల్లో సాగుచేయడం జరిగిందన్నారు. ఏదుల, పెబ్బేరు మండలాలకు కొంత సాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని.. జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నీరు వదిలితే సమస్య తీరుతుందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. వీసీలో డీఏఓ గోవింద్ నాయక్, విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజశేఖర్, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ ఉన్నారు.

నిబంధనల మేరకే అనుమతులు..

ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లాలో కొత్తగా ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, డెంటల్ ఆస్పత్రుల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పరిశీలించింది. దరఖాస్తుల్లో పొందుపరిచిన విషయాలు, ఆస్పత్రుల్లో ఉన్న సదుపాయాలు, డాక్టర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లినికల్ యాక్ట్ ప్రకారం ఉన్న వాటికి అనుమతులు మంజూరు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి..

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. నేటి ప్రజావాణిలో 22 అర్జీలు వచ్చాయని.. వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు.

క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం

జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 17వ తేదీలోగా వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో క్షయవ్యాధి, మిషన్ మధుమేహం, పిల్లలకు టీకాల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1.60 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 1.26 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 281 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అదే విధంగా మిషన్ మధుమేహలో భాగంగా మొత్తం 2.30 లక్షల మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు లక్ష మందికి మాత్రమే పరీక్షలు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారిని ఈ నెల 20 వరకు నిర్ధారణ పరీక్షలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 23వేల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పిల్లలకు సమయానుసారం ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో ఇవ్వాలని సూచించారు. టీకాలు ఏ ఒక్కటి పెండింగ్‌లో ఉండకూడదన్నారు. గర్భిణులకు సకాలంలో ఏఎన్‌సీ నమోదు చేయించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో సుఖ ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం పోలియో రహిత సమాజం కోసం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు సాయినాథ్, పరిమళ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధికి హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం సుమారు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని.. మరో రూ. వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తిలో విద్య అభ్యసించిన అభిమానంతో ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. అతి తక్కువ కాలంలో సీఎం సభ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడం.. విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల విషయమై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి చేసిన ఆరోపణలు సత్యదూరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ నిర్మాణాలకు మాత్రమే జీఓలు ఇచ్చారని.. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసింది 500 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి మాత్రమేనన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అదే విధంగా గతంలో కేటీఆర్ ఐటీ టవర్, ఇతర అభివృద్ధి పనులకు ప్రభుత్వ జీఓలు లేకుండానే శంకుస్థాపన చేశారని.. ఈ విషయమై పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. దివంగత మాజీ ఎమ్మెల్యేలు జయరాములు, బాలకిష్టయ్య పేర్లతో గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రికి నామకరణం చేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చందర్, నాయకులు కిచ్చారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని హంగామా సృష్టించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. రూ. 550 కోట్ల పనులకే పరిమితం కావడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి అనే కాంగ్రెస్ నైజం వనపర్తి వేదికగా బయటపడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో కేంద్ర ప్రభుత్వ నిధుల వాటా ఉందని ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఒకే పార్టీలో ఉంటూ కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగిన కిషన్‌రెడ్డిపై అనవసర విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. సమావేశంలో బీజేపీ నాయకులు చిత్తారి ప్రభాకర్, రామన్‌గౌడ్, పెద్దిరాజు, శ్రీనివాస్, కుమారస్వామి, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్, గోపినాథ్, రాజశేఖర్‌గౌడ్, నవీన్‌చారి, రవికుమార్ ఉన్నారు.



వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి పాండే

వనపర్తి టౌన్: వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్, చీఫ్ ఇంజినీరు పాండే ఆదేశించారు. వేసవి యాక్షన్ ప్లాన్ పనుల పరిశీలనలో భాగంగా సోమవారం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ, గృహ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని సూచించారు. వేసవి యాక్షన్ ప్లాన్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 33కేవీ బుద్దారం ఫీడర్ ఓవర్‌లోడ్‌ను నియంత్రించాలన్నారు. అందుకోసం 33/11 కేవీ పాలికేపాడ్ సబ్‌స్టేషన్ లోడ్‌ను 33కేవీ బుద్దారం ఫీడర్ నుంచి 33కేవీ గోపాల్‌పేట ఫీడర్‌కు మార్చాలని ఆదేశించారు. అదే విధంగా 33 కేవీ సోలీపూర్ ఫీడర్ నిర్మాణంలో ఉన్న లైన్‌ను పర్యవేక్షించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పెద్దమందడి మండలం వెల్టూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో రూ. 1.10కోట్ల బడ్జెట్‌తో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పెద్దమందడి మండలం అనకాయపల్లి తండాలో రైతులతో ఆయన సమావేశమై విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్ఈ రాజశేఖరం, వెంకటశివరాం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న అన్వేషణ

- బురద, ఊట నీరే ప్రధాన సమస్య
- నిమిషానికి 10- 20 వేల లీటర్ల నీటి ఊట
- సొరంగంలో చిక్కుకున్న వారిని బయటికి తేవడంలో అవరోధాలు
- పదోరోజు కొనసాగిన సహాయక చర్యలు
- రెస్క్యూ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం



సొరంగం లోపల తవ్వకాలు జరుపుతున్న సింగరేణి రెస్క్యూ బృందాలు



సహాయక చర్యల కోసం లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్తున్న బృందాలు

అచ్చంపేట/మన్ననూర్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు సోమవారం పదో రోజు కూడా కొనసాగాయి. కార్మికుల ఆచూకీ కోసం రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే భారీస్థాయిలో పేరుకుపోయిన బురద, ఉబికి వస్తున్న నీటి ఊటతో వీరి అన్వేషణకు అవరోధాలు కలిగిస్తున్నాయి. దాదాపు 10- 20 వేల లీటర్ల మేర నీటి ఊట ఉబికి వస్తుంది. మరోవైపు తమవారి రాక కోసం కుటుంబసభ్యులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఎస్ఎల్‌బీసీ సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి కన్వేయర్ బెల్టు మరమ్మతు సోమవారం సాయంత్రానికి పూర్తవుతాయని చెప్పారు. కానీ, ఇక్కడి పరిస్థితి చూస్తే మరో రెండు రోజులైనా కన్వేయర్ బెల్టు మరమ్మతు జరిగే అవకాశం కనిపించడం లేదు. దీని కోసం సింగరేణి, రాబిట్ బృందాలు కష్టపడుతున్నాయి. సొరంగంలో పేరుకుపోయిన శిథిలాలను సింగరేణి బృందాలు మాన్యువల్ పద్ధతిలో తవ్వకాలు చేపడుతున్నారు. ఆ మట్టిని లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ కూడా ఒకింత ఆటంకం సృష్టిస్తుంది. దీనిని బట్టి 15 అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద, మట్టి బయటికి తేవడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందో కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు. రాడార్ (జీపీఆర్) స్కానింగ్ గుర్తించిన మూడు, నాలుగు ప్రదేశాల్లో శిథిలాలు తొలగించినా ఆనవాళ్లు దొరకలేదు. ఎంత తవ్వితే అంత ఊట బయటికి వస్తుండటంతో ఎప్పటికప్పుడు డీవాటరింగ్ చేస్తున్న పనులకు అడ్డంకులు కలిగిస్తుంది.

సహాయక చర్యలు వేగవంతం

సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో మట్టిని తొలగించేందుకు కన్వేయర్ బెల్టు పనులు వేగవంతం చేసినట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిందకుమార్ తెలిపారు. సోమవారం ఎస్ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్ వద్ద రెస్క్యూ బృందాల ఆపరేషన్‌లో పాల్గొన్న సహాయక బృందాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిని తొలగించేందుకు డీవాటరింగ్ ప్రక్రియ వేగవంతం చేశామని చెప్పారు. 12 సంస్థలకు సంబంధించిన బృందాలు సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారని, సమస్యలు ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ ముందుకుపోతున్నామని చెప్పారు. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకాధికారులతో సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో సొరంగంలో మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాలను తొలగించే పనులు వేగవంతం చేశామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వారి జాడ గుర్తిస్తామని పేర్కొన్నారు. ఇరువైపుల నుంచి నీరు రాకుండా సొరంగంలో ఇప్పటికే నిల్వ ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను చేపట్టామని, దీని కోసం ప్రత్యేక యంత్రాలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మోహ్రా, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి ప్రసన్న, హైడ్రా, సింగరేణి, మైన్స్ తదితర సంస్థలు పాల్గొన్నాయి.

పాలమూరుకు అన్యాయం చేయం



విలేకరులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: పాలమూరుకు అన్యాయం జరిగితే తట్టుకోలేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి నీరు తీసుకుపోవడాన్ని మంత్రి మండలి సమావేశంలో తాను విభేదించినట్లు చెప్పారు. 6, 7 టీఎంసీలు నిల్వ ఉండే ఏదుల రిజర్వాయర్ నుంచి కాకుండా వట్టెం నుంచి రెండు ప్రాంతాల్లో లిఫ్ట్ చేస్తే కేవలం రూ. 200 కోట్లతో డిండికి నీరు తీసుకెళ్లవచ్చని సూచించినట్లు వెల్లడించారు. కొన్ని శాఖల అధికారులు, గత ప్రభుత్వ నిర్లక్ష్యపు ధోరణితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 62కోట్లతో కొత్తగా మంజూరు చేసిన కాశీంనగర్ ఎత్తిపోతల పథకంతో అంజనగిరి, దత్తాయిపల్లి, జయన్న తిర్మలాపూర్, అప్పాయిపల్లి, కాశీంనగర్‌తో పాటు 19 తండాల్లో 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. డీ- 8 కాల్వ నుంచి గ్రావిటీ ద్వారా రామన్నగట్టు రిజర్వాయర్‌లో నీరు నిల్వచేసి, లిఫ్ట్ ద్వారా ప్రతిపాదిత ప్రాంతాలకు సాగునీరు అందుతాయన్నారు. వనపర్తి వాసులకే కాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు స్థానికంగా, హైదరాబాద్ వేదికగా వైద్యసేవలు అందించిన డాక్టర్ మాధవరెడ్డి విగ్రహాన్ని వనపర్తిలో ఏర్పాటు చేయడంతో పాటు కొత్త లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆయన పేరు పెడతామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ సంస్థలతో కలిసి ముందుకు సాగారని.. ఆ తర్వాత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో విపత్కర సమస్య ఉత్పన్నమైందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు ఖమర్, కోట్ల రవి, బాబా, సహదేవ్, కోళ్ల వెంకటేష్, యాదయ్య, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పెంటన్న, సమద్, జాన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నాగయ్య (ఫైల్)

గోపాల్‌పేట: పొలానికి నీరు పెట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. రేవల్లి మండలంలోని పాత బండరావిపాకులలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. పాత బండరావిపాకుల గ్రామానికి చెందిన తలారి నాగయ్య(59) వ్యవసాయ పొలం కేఎల్ఐ డీ–5 కాల్వ సమీపంలో ఉంది. అయితే సోమవారం ఉదయం మోటారు పనిచేయకపోవడంతో పరిశీలించగా మోటారు చుట్టూ నాచు చేరింది. దీంతో అది తీసేందుకు కాల్వలోకి దిగి సరిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన స్థానిక రైతులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై నాగయ్య భార్య తలారి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాము చెప్పారు.

వివాహిత బలవన్మరణం

రాజాపూర్(బాలానగర్): అదనపు కట్నం వేధింపులు భరించలేక ఓ వివాహిత దుందుభీ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ ఎస్ఐ లెనిన్‌గౌడ్ కథనం ప్రకారం.. బాలానగర్ మండలం గుండేడ్‌కి చెందిన చారకొండ లక్ష్మి(38)కి 17 ఏళ్ల క్రితం గంట్లవెల్లికి చెందిన చారకొండ లింగమయ్యతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.1.50లక్షలతో పాటు 4తులాల బంగారం, బైక్ కట్నంగా ఇచ్చారు. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఆతర్వాత అదనపు కట్నం కోసం భర్త వేధించసాగాడు. దీంతో మూడేళ్ల కిత్రం లక్ష్మి తల్లి రాములమ్మ రూ.లక్ష ఇచ్చి అల్లుడికి ఇచ్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో లక్ష్మి పుట్టింటికి వచ్చింది. ఆదివారం సాయంత్రం పెద్దమనుషులతో పంచాయితీ పెట్టి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా లింగమయ్య దాడికి పాల్పడటంతో లక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అందరూ కలిసి వెతకగా బాలానగర్ పాత బ్రిడ్జి కింద నీటిలో మృదేహం ఉందని సమాచారం అందగా అక్కడికెళ్లి చూస్తే లక్ష్మి విగత జీవిగా పడి ఉంది. మృతురాలి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ..

మల్దకల్: కుటుంబ కలహాలతో వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అమరవాయికి చెందిన కుర్వ బుచ్చమ్మ (42), జమ్మన్న భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. వారికి ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలాన్ని సాగు చేసుకోవడంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. ఇటీవల కుమారుడి వివాహం చేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీనికి తోడు కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన బుచ్చమ్మ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. గమనించిన భర్త జమ్మన్న చికిత్స నిమిత్తం ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మరో వ్యక్తి ఆత్మహత్యాయత్నం..

అమరవాయి గ్రామంలో మరో వ్యక్తి కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. అమరవాయికి చెందిన నాగరాజు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో కొంత ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఇంట్లో ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన అతడు.. సోమవారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..




జాను (ఫైల్)

బిజినేపల్లి: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని లట్టుపల్లి శివారు భీమునితండాకు చెందిన జాటోతు జాను(33) సోమవారం సాయంత్రం బిజినేపల్లి నుంచి తండాకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అయితే వెల్గొండ గేటు సమీపంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందున్న మరో బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన జాను బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జానును స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

అదుపుతప్పి..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌కాలనీకి చెందిన శ్రీనివాసులు(40) ఆదివారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ నుంచి జిల్లాకేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై శ్రీనివాసులు భార్య యాదమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకులు ఢీకొని మరొకరు..


సాంబశివుడు (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడని ఎస్ఐ సతీష్ తెలిపారు. మొలకుంట సాంబశివుడు(25) తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి బైక్‌పై ముష్టిపల్లి నుంచి కుడికిళ్లకు వెళ్తుండగా సాతాపూర్ వద్ద సంగమోని శ్రీకాంత్ బైక్‌పై వస్తూ సాంబశివుడు వాహనాన్ని ఢీకొట్టడంతో సాంబశివుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సాంబశివుడు మాచ్‌పల్లిలో ఆర్ఎంపీగా పనిచేస్తుండగా వివాహం కాలేదు. ఈ ఘటనపై తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


ఆర్చరీ క్రీడాకారులతో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి, మొదటి అదనపు న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి, తదితరులు

- నేషనల్ పోటీలకు 18 మంది క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ కొల్లూరులో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్–10, అండర్–13, అండర్–15 విభాగాల ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో రాణించిన 18 మంది క్రీడాకారులు గుంటూర్‌లో ఈ నెల 22 నుంచి 27 వరకు జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో అండర్–10 కంపౌండ్ బాలికల్లో 20 మీటర్ల శ్రీహిత రాథోడ్, సిద్దిక్షా, ఐషా ఫాతిమా, బాలురలో రోషన్ ఏకలవ్య, హిమనిష్, అండర్–10 ఇండియన్ రౌండ్ 15 మీటర్లలో రోహన్, అండర్–13 బాలికల కంపౌండ్ 30 మీటర్లలో సాయి సమీక్ష, ఐషా ఫాతిమా, షేర్వాణి, సన్నిభా, బాలురలో క్రుతిక్‌శ్రీ వాస్తవ్, సాయి మనీశ్వర్, అండర్–15 కంపౌండ్ 40 మీటర్లలో సాయి సిద్దిక్షా, సన్నిభా, శేర్వాణి, బాలురలో క్రుతిక్ శ్రీవాస్తవ్, రికర్వు విభాగంలో కౌషిక్ యాదవ్ ఉన్నారు. ఆర్చరీ క్రీడాకారులను సోమవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి అభినందించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు విజయ్‌కుమార్, ఉదయ్ నాయక్, ఏఓ సీనియర్ సూపరింటెండెంట్ మూర్తి, సీనియర్ సూపరింటెండెంట్ జగన్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్, డాక్టర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై వేటు


ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏటీడీఓ యాదమ్మ

- విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు
- డీటీడీఓ ఆదేశాల మేరకు ఏటీడీఓ విచారణ
- విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు

బల్మూర్: మండలంలోని చెంచుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం తిరుపతయ్య ఓ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించాడని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం ఏటీడీఓ యాదమ్మ విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి ఏటీడీఓ వివరాల మేరకు.. పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని 20 రోజుల క్రితం హాజరు రిజిస్టర్ కోసం ఆఫీస్ రూంలోకి వెళ్లగా.. అక్కడే ఉన్న హెచ్‌ఎం తిరుపతయ్య అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులకు చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆదివారం డీటీడీఓకు ఫోన్ ద్వారా హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. డీటీడీఓ ఆదేశాల మేరకు ఏటీడీఓ విచారణ చేపట్టారు. అయితే సదరు బాలిక పాఠశాలలో లేకపోవడంతో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలకు రావాలని కోరగా.. వస్తామని రాలేదు. దీంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఏటీడీఓ విచారించారు. అయితే హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తేలిందన్నారు. సదరు బాలిక రాత్రివేళ వింత చేష్టలతో భయపెడుతూ జాతకాలు చెబుతానంటూ భయపెడుతుందని తోటి బాలికలు తెలిపినట్లు ఏటీడీఓ తెలిపారు. ఇదిలా ఉంటే, హెచ్‌ఎం విధులకు సక్రమంగా రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా అతడిపై వచ్చిన ఇతర ఆరోపణలతో అచ్చంపేటలోని ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేస్తూ డీటీడీఓ ఆదేశాలు జారీ చేసినట్లు ఏటీడీఓ తెలిపారు. ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఐటీడీఏ డిప్యూటీ ఈఓ శంకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. విచారణపై పూర్తి నివేదికను డీటీడీఓకు అందజేయనున్నట్లు తెలిపారు.

- ఈ విషయమై హెచ్‌ఎం తిరుపతయ్యను వివరణ కోరగా.. తన మనవరాండ్రు వయసు ఉన్న బాలిక తనపై ఇలాంటి ఆరోపణ చేయడం బాధాకరమన్నారు. 20 రోజుల క్రితం జరిగినట్లు ఇప్పుడు అధికారులకు చెప్పడంలోనే అసత్యం ఉందన్నారు. కాగా, బాలిక తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడటానికి ప్రయత్నించగా.. తాము ఎవరికీ చెప్పలేదని సరైన సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేశారు.

దివ్యాంగుల కోసం చట్టం చేయాలి

- 'లక్ష సంతకాల సేకరణ'లో భాగస్వాములు కావాలి
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అడివయ్య



మహబూబ్‌నగర్ రూరల్: స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మహబూబ్‌నగర్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు టి.మధుబాబు అధ్యక్షతన సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు కురుమూర్తి మాట్లాడారు. 2012 నుండి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ. 300 మాత్రమే చెల్లిస్తుందని, దీంతో దివ్యాంగులు ఎట్లా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ప్రాతినిధ్యం చట్ట సాధనకోసం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ ఉద్యమం కొనసాగుతుందని, ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు టి.మధుబాబు మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల సమస్యలను అధికారులు పట్టించుకోవడంలేదని న్నారు. అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని కోరారు.జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు పారిజాత, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

హింసకు మనువాద విధానాలే కారణం


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

- 'చేవెళ్ల డిక్లరేషన్'పై సీఎం మౌనం వీడాలి
- అంటరానితనాన్ని నేటి యువత ప్రతిఘటించాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలో హింస పెరగడానికి మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలే ప్రధాన కారణమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. మహబూబ్‌నగర్‌లోని అరుంధతి భవన్‌లో సోమవారం కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు రెండో రోజు కొనసాగగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున అధ్యక్షత వహించారు. ఈ ముగింపు సమావేశానికి స్కైలాబ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వీడాలని, తక్షణమే అంబేద్కర్ అభయహస్తానికి మార్గదర్శకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంటరానితనాన్ని నేటి ఆధునిక యువతరం ప్రతిఘటించాలన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనువాదం, దళిత మహిళా హక్కులు అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో పురోభివృద్ధి చెందినా నేటికీ కుల వివక్ష, అంటరానితనం కొనసాగడం దేశం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. దళితులకు అసైన్డ్ చేయబడిన భూములకు సత్వరమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతోన్మాద మూక దాడులు, కుల దురహంకార హత్యలు పెట్రేగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి కులాంతర వివాహితుల రక్షణ చట్టం చేయాలలని కోరారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కుర్మయ్య, మనోహర్, ఆరూరి కుమార్, డి.రాధాకృష్ణ, ఎం.ప్రకాష్ కారత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు టి.సురేష్, మంద సంపత్, డి.దినాకర్‌రెడ్డి, డి.రామ్మూర్తి, పరశురాములు, బాలపీరు. బాలకిషన్, దేవేందర్, మల్కయ్య పాల్గొన్నారు.

సరిహద్దులు దాటుతున్న బియ్యం

- లారీలను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు


సీజ్ చేసిన బియ్యం లారీలతో విజిలెన్స్ అధికారులు

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టులో సోమవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు బియ్యం లారీలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ వెంకటేష్ మాట్లాడుతూ.. కొంతకాలంగా మన బియ్యం రాష్ట్ర సరిహద్దులను దాటి వెళ్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కమిషనర్ ఆదేశాల మేరకు తాము ఆకస్మికంగా సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరు లారీలు, ఒక డీసీఎం వ్యాన్‌లో కర్ణాటకకు వెళ్తున్న బియ్యం వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. వాటికి సంబంధించిన సరైన పత్రాలు డ్రైవర్ల వద్ద లేకపోవడంతో లారీని సీజ్ చేసి కృష్ణా పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వాహనాల్లోని బియ్యం రైస్ మిల్లర్లవా.. అక్రమంగా తరలిస్తున్నారా అనే విషయం విచారణ అనంతరం వెల్లడిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

అలంపూర్: పట్టణంలోని సంతోష్ నగర్ కాలనీకి చెందిన రైతు బుచ్చాలు నిల్వచేసిన పశుగ్రాసం సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. రైతు బిచ్చాలు తన పశువుల పాక వద్ద వరిగడ్డి, వేరుశనగ పొట్టు, ఇతర పశుగ్రాసం నిల్వ చేయగా.. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే మూడు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ మాసుం బాషా, జూనియర్ అసిస్టెంట్ మహేందర్ అక్కడికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వపరంగా బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

క్రికెట్ క్రీడాకారుడికి అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ క్రికెట్ పురుషుల జట్టు తరఫున పలు పోటీల్లో పాల్గొని ఇటీవల విజయ్ (వీజీ) ట్రోఫీకి ఎంపికైన విద్యార్థి డేవిడ్ క్రిపాల్‌ను సోమవారం పీయూ వీసీ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీయూ విద్యార్థి వీజీ ట్రోఫీకి ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. రంజీ ట్రోఫీ, ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ పోటీల్లో రాణించి పీయూకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీయూలో క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, పీడీలు సత్యభాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాల కుట్రలను దళితులు తిప్పికొట్టాలి

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర కో–ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి


మాట్లాడుతున్న బ్యాగరి వెంకటస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ కుట్రలు దళితులు ఏకమై తిప్పికొట్టాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కో–ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి దళితుల అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా చేవేళ్ల డిక్లరేషన్ ప్రకారం పెరిగిన దళితుల జనాభా దామాషా ప్రకారం 20 శాతానికి రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం మంగళవారం అలంపూర్‌లో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాల ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాఅధ్యక్షుడు జి.చిన్న, ప్రధానకార్యదర్శి మహేందర్, నాయకులు ఆనంద్, రవికుమార్, ఆంజనేయులు, తిరుపతయ్య, రామచంద్రయ్య, వెంకట్రాములు, శ్రీనివాసులు, కె.ఆంజనేయులు, శివకుమార్ పాల్గొన్నారు.

బొప్పాయి తోట ధ్వంసం

బల్మూర్: బొప్పాయి తోటను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని కొండనాగుల శివారులో సోమవారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతు గుండాల అనీల్ కొండనాగుల శివారులోని తన ఐదెకరాల పొలంలో ఏడాది క్రితం బొప్పాయి తోట సాగుచేశాడు. ప్రస్తుతం కోత దశలో ఉన్న తోటలోని కాయలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రేగి ముళ్లతో పొడిచి నాశనం చేయడంతో రూ. 2లక్షల నష్టం వాటిల్లింది. అంతే కాకుండా తోటలో ఉన్న వ్యవసాయ బోరు స్టార్టర్ వద్ద విద్యుత్ షాక్ పెట్టి యాజమానిపై హత్యాయత్నం చేశారు. తనకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని ఉందని సోమవారం బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.

అది భూదాన్ భూమే..

- ధరణిలో సరిదిద్దాలని సీసీఎల్‌ఏ కోర్టు ఆదేశం


జడ్చర్ల శివారులోని అసైన్డ్ భూమి

జడ్చర్ల: భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేసిన భూమిని అసైన్డ్‌గా మార్చడం.. ఆ భూమిని పీఓటీ(ప్రొహిబిటెడ్ ఆర్డర్ బుక్)లో పొందుపర్చడం.. తదుపరి ఇదే అసైన్డ్ భూమిని పట్టాగా పేర్కొంటూ పీఓటీ నుంచి తొలగించడం వంటి పరిణామాలతో వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల పట్టణ శివారులోని సర్వే నంబర్ 138లో మొత్తం 16.32 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి యజమాని మాజీ ఎమ్మెల్యే కొత్త కేశవులు 1957–58 సంవత్సరంలో 2.10 ఎకరాల భూమిని భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించి.. మిగతా 14.22 ఎకరాల భూమిని తన పేరున ఉంచుకున్నారు. తదుపరి భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించిన 2.10 ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్డ్ భూమిగా పేర్కొంటూ ఇతరులకు కేటాయించింది.అంతేగాక ఈ భూమికి సంబంధించి ఇతరులకు రిజిస్ట్రేషన్ కాకుండా పీఓటీలో కూడా చేర్చింది.అయితే ఈ భూమికి ఎన్‌ఓసీ తీసుకువచ్చి తదుపరి చేతులు మారడం వివాదాస్పదంగా మారింది. ఎన్‌ఓసీ తీసుకువచ్చిన వారు తదుపరి నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్)గా కూడా మార్చారు. దీంతో కొందరు సీసీఎల్‌ఏ కోర్టును ఆశ్రయించారు. విచారించిన సీసీఎల్‌ఏ కోర్టు భూదాన్ భూమిగా గుర్తించి.. వారి హక్కులను రద్దుచేసి, ధరణిలో భూదాన్ భూమిగా సరిదిద్దాలని పేర్కొంటూ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

వినియోగిస్తే మేలు..

జడ్చర్ల వంద పడకల ఆస్పత్రికి చేరువలో ఉన్న అతి విలువైన ఈ భూమిని ఇప్పటికైనా అధికారులు, పాలకులు సద్వినియోగం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అనేక ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, తదితర వాటికి భూములు అందుబాటులో లేని ప్రస్తుత పరిస్థితుల్లో ఈ అసైన్డ్ భూమిని త్వరితగతిన స్వాధీన పర్చుకుని అభివృద్ధి పనులకు కేటాయించాలని కోరుతున్నారు. కోర్టుకు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, తదితర వాటి ఏర్పాటుకు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముమ్మాటికి అసైన్డ్ భూమి..



జడ్చర్ల శివారులోని సర్వే నంబర్ 138లో గల భూమి ముమ్మాటికి అసైన్డ్ భూమి. దీన్ని కొందరు తమ పేర్లపై పట్టా మార్పిడి చేసుకుని స్వాహా చేసే ప్రయత్నం చేశారు. దీనిపై తాము సీసీఎల్‌ఏ కోర్టును ఆశ్రయించాం. ఎట్టకేలకు న్యాయమే గెలిచింది. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజోపయోగ పనులకు ఉపయోగించాలి.

– ప్రణీల్ చందర్, ఫిర్యాదుదారుడు

స్వాధీనం చేసుకుంటాం..



అసైన్డ్ భూమికి సంబంధించి సీసీఎల్ కోర్టు నుండి వచ్చిన ఆదేశాలను పాటిస్తాం. త్వరలోనే సదరు భూమిని స్వాధీనం చేసుకుంటాం. తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

– నర్సింగరావు, తహసీల్దార్, జడ్చర్ల

కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య

హన్వాడ: కట్టుకున్న ఇల్లాలే భర్తను కడతేర్చిన ఘటన మండలంలోని ఇబ్రహీంబాద్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ఇబ్రహీంబాద్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్(47) సెంట్రింగ్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే వాడు. ఆదివారం ఎప్పటిలాగే కూలీ పనులను ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. అయితే కూలి డబ్బుల్లో రూ. 5వేలు తగ్గడంతో అతడి భార్య లక్ష్మి గొడవకు దిగింది. డబ్బులు ఎందుకు తగ్గా యని భార్య నిలదీయడంతో తన తమ్ముడికి ఇవ్వాల్సిన డబ్బును చెల్లించినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలపడంతో ఇరువురి మధ్య గొడవ మరింత పెరిగింది. తమ సంబంధీకులు వచ్చి ఇద్దరికీ సర్ది చెప్పారు. ఈ క్రమంలో రాత్రి అందరూ నిద్రించిన తర్వాత కుమారుడు రాముతో కలిసి లక్ష్మి శ్రీనివాస్‌గౌడ్ గొంతు నులిమి హత్యచేశారు. ఇదిలా ఉంటే, అతడి పేరుపై వ్యవసాయ భూమి, గృహరుణం ఉన్నాయి. అయితే భర్త శ్రీనివాస్‌గౌడ్ మరణిస్తే ఇన్సూరెన్స్ వర్తించడంతో ఇంటి అప్పు తీరి, ఇన్సూరెన్స్ కింద డబ్బులు వస్తాయనే కోణంలో హత్య జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. అతడి భార్య లక్ష్మిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించడంతో కుమారుడు రాముతో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.